# రోడ్డెక్కిన రాయల్ మిడోస్ వాసులు

- నిర్మాణదారుడిని కట్టడి చేయాలని ధర్నా
- పోలీసుల హామీతో శాంతించిన కాలనీ వాసులు

**కుత్బుల్లాపూర్:** ఆ కాలనీ వాసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది ఓ కొత్త నిర్మాణం.. పనిచేసే కార్మికులు సైతం మూత్ర విసర్జనను మొదలుకుని ఇతర అవసరాలను సైతం బహిరంగంగా రోడ్లపైనే చేస్తుండటంతో తీవ్ర దుర్గంధంతో పాటు వ్యాధులు సంక్రమిస్తున్నాయి. ఈ క్రమంలో కాలనీ వాసులు పలుమార్లు నిర్మాణదారుడిని హెచ్చరించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆదివారం 50 కుటుంబాలు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేపట్టడంతో పేట్ బషీరాబాద్ పోలీసులు రంగ ప్రవేశం చేసి శాంత పరిచారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని కొంపల్లి మున్సిపాలిటీలో సినీ ప్లానెట్ సమీపంలో రాయల్ మిడోస్ గేటెడ్ కమ్యూనిటీ విల్లాస్ ఉన్నాయి. దీని పక్కనే భారీ నిర్మాణం సంవత్సర కాలంగా కొనసాగుతూ వస్తోంది. ఇక్కడ నిర్మాణ సామగ్రితో పాటు ఎటువంటి రక్షణ ఏర్పాట్లు చేయకుండా పనులు చేస్తుండటంతో దుమ్ము, ధూళి ఇళ్లపై పడి ప్రజలు శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారు. అంతేగాకుండా ఇక్కడ పనిచేసే కార్మికులు సైతం మలమూత్ర విసర్జన బహిరంగంగానే చేస్తున్నారు. ఈ విషయంపై కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గోపాల్‌రెడ్డి పలు పర్యాయాలు నిర్మాణదారులకు చెప్పి చూశారు. అయినా ఎటువంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో సంక్షేమ సంఘం ప్రతినిధులతో పాటు మహిళలు, పిల్లలతో సహా ఆందోళనకు దిగడంతో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న పేట్ బషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ మహేశ్ అక్కడికి చేరుకుని విల్లా వాసులతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. సదరు కన్‌స్ట్రక్షన్ చుట్టూ దుమ్ము, ధూళి రాకుండా పూర్తిస్థాయి ఏర్పాట్లు చేసిన తరువాతనే పనులు చేపట్టాలని నిర్మాణదారులకు సూచించారు.



ధర్నా చేస్తున్న రాయల్ మిడోస్ వాసులు

### ప్రజలకు ఇబ్బందులు సృష్టిస్తే ఊరుకోం..

ఇప్పటికే రెండుసార్లు సదరు నిర్మాణంపై ఫిర్యాదులు రావడంతో తాము హెచ్చరించాం.. ఇతరులకు ఇబ్బందులు కలిగేలా పనులు చేస్తే ఊరుకునే సమస్యే లేదు. చుట్టు రక్షణ ఏర్పాట్లు లేకుండా నిర్మాణం చేపడితే అట్టి నిర్మాణాన్ని నిలిపేస్తాం. సోమవారం టౌన్ ప్లానింగ్ అధికారులతో సదరు నిర్మాణాన్ని పరిశీలించి చర్యలు చేపడతాం.

– ఎంఎన్ఆర్ జ్యోతి, కమిషనర్, కొంపల్లి

## ప్రమాణ స్వీకారోత్సవం

**దుండిగల్:** నగర పాలక, పురపాలక మేయర్, చైర్మన్ల ఎన్నిక సోమవారం జరగనుంది. నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్, కొంపల్లి మున్సిపాలిటీ కార్యాలయాల్లో సభ్యుల సమక్షంలో ఎన్నుకోనున్నారు. ముందుగా కార్పొరేటర్లు, కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం ఎన్నిక ఉంటుంది. అదే సమయంలో డిప్యూటీ మేయర్, వైస్ చైర్మన్ల ఎంపిక సైతం జరగనుంది. ఇప్పటికే దుండిగల్ మున్సిపాలిటీలో గెలిచిన టీఆర్ఎస్ కౌన్సిలర్లను క్యాంప్‌నకు తరలించారు. నగర శివారులోని ఓ రిసార్ట్‌లో బసచేసిన వీరంతా నేరుగా సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయానికి చేరుకుంటారని సమాచారం.

## 'నేతాజీ' విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు


కలెక్టర్ చేతులమీదుగా మెమొంటో అందుకుంటున్న నేతాజీ విద్యార్థులు

**కుత్బుల్లాపూర్:** మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో కుత్బుల్లాపూర్ పరిధి భాగ్యలక్ష్మి కాలనీలోని నేతాజీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రదర్శనతో అబ్బురపరిచారు. అనంతరం కలెక్టర్ ఎంవీ రెడ్డి నేతాజీ హైస్కూల్ సిబ్బందిని, విద్యార్థులను అభినందించి మెమొంటోను అందజేశారు. డీఈవో విజయకుమారి, పాఠశాల కరస్పాండెంట్ మహేశ్ యాదవ్ ఉన్నారు.

## ఐక్యంగా సమస్యలను పరిష్కరించుకోవాలి


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కూన శ్రీనివాస్‌గౌడ్

**సూరారం:** చంద్రగిరినగర్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆదివారం షాపూర్‌నగర్‌లో కూన కృష్ణ మహాలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ ఐక్యంగా ఉండి స్థానిక సమస్యల పరిష్కారానికి కృషిచేస్తూ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంతోష్, శ్రీను, మల్లప్ప, అశోక్, విజయ్, శ్యాంబాబు తదితరులు ఉన్నారు.

## మార్కండేయ జయంతి పూజలు

**జగద్గిరిగుట్ట:** మార్కండేయ స్వామి జయంతి సందర్భంగా గాజులరామారం డివిజన్ శ్రీరామ్‌నగర్‌లో సోమవారం ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ కమిటీ చైర్మన్ గుదె రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు.

మరిన్ని జోన్ వార్తలు 14 వ పేజీలో

## బేకరీ ఐటమ్స్ తయారీపై శిక్షణ


శిక్షణకు ఎంపికైన మహిళలతో మర్రి రాజశేఖర్‌రెడ్డి

**దుండిగల్:** మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంఎల్ఆర్ ఐటీ కళాశాల సెక్రటరీ మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. దుండిగల్‌లోని కళాశాలలో ఎంఎస్ఎంఇ ఆధ్వర్యంలో నెలకొల్పిన ఇంక్యూబేషన్ సెంటర్‌లో శిక్షణకు ఎంపికైన మొదట బ్యాచ్ సభ్యులతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బేకరీ ఐటమ్స్ తయారు చేయడంపై ఏడు వారాల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, మొదటి బ్యాచ్‌కు 12 మంది మహిళలను ఎంపిక చేశామని, వివిధ ప్రాంతాల్లో మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు, ఇన్‌చార్జి ఫణిబాబు, మహిళా బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.

## సత్కారం

**దుండిగల్:** పురపాలక ఎన్నికల్లో దుండిగల్ మున్సిపాలిటీలో గెలుపొందిన కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కూన శ్రీశైలంగౌడ్‌ను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయా వార్డుల్లో టీఆర్ఎస్ అభ్యర్థులను ధీటుగా ఎదుర్కొని మెజార్టీతో గెలుపొందిన కౌన్సిలర్లను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సత్కరించారు. కౌన్సిలర్లు రాముగౌడ్, మహేంద్ర యాదవ్, సాయిబాబాయాదవ్, ఆనంద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.


కూన శ్రీశైలంగౌడ్‌ను కలిసిన దుండిగల్ మున్సిపల్ కాంగ్రెస్ కౌన్సిలర్లు

## ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**సుభాష్‌నగర్:** మైసమ్మగూడలోని మల్లారెడ్డి కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ(ఎంబీఏ) కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2004- 2019 వరకు విద్యను అభ్యసించి దేశ, విదేశాల్లో వివిధ ఉద్యోగాల్లో స్థిరపడిన 180 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్‌కే రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. సమ్మేళనం సందర్భంగా నూతన టెక్నాలజీ, ప్రస్తుత మార్కెట్‌లో ఉన్న ఉద్యోగవకాశాలను పూర్వ విద్యార్థులు తమ జూనియర్లకు వివరించారు. వీఎస్‌కే రెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఒకే వేదికపైకి రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ మురళీకృష్ణ, హెచ్‌ఓడీ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థులతో కళాశాల యాజమాన్యం, ప్రొఫెసర్లు




సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక మరియు సాక్షి టీవీలో ఇవ్వదలచుకుంటే సంప్రదించండి.
9912220366
9912348029